క్లుప్తంగా

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884-2357800కు కాల్ చేసి, సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం ఎప్పటిలాగే కొనసాగుతుందని పేర్కొన్నారు.

సీఎం జగన్ కోసం చర్చిల్లో ప్రార్థనలు

పాస్టర్లకు ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి


ప్రీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో సినీనటి జయసుధ

కాకినాడ: రానున్న ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి గెలుపొందాలని చర్చిల్లో ప్రార్థనలు చేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాస్టర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన గాంధీనగర్ హౌస్ ఆఫ్ చర్చి, ఎల్విన్‌పేట తెలుగు బాప్టిస్ట్ చర్చిలను సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో చర్యలు తీసుకున్నారన్నారు. గౌరవ వేతనాలు, చర్చిల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. ఆయన వెంట ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి(చినబాబు), వైఎస్సార్ సీపీ నాయకులు డీకే రెడ్డి, బాదం మధు, దండు మహంతి లక్ష్మణరావు, యార్లగడ్డ రాంబాబు చౌదరి, క్రైస్తవ ప్రతినిధులున్నారు.

ముగిసిన ప్రీ కిస్మస్ వేడుకలు

బోట్‌క్లబ్: లోకానికి రక్షకుడిగా ఏసు జన్మించాడని, ఆయన లేకుండా చరిత్ర లేదని అంతర్జాతీయ సువార్తకులు డాక్టర్ కుముయి అన్నారు. రక్షణ టీవీ, జీసీకే సంయుక్తంగా నిర్వహించిన స్థానిక మెక్లారిన్ గ్రౌండ్‌లో ప్రీ కిస్మస్ ముగింపు వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. సీవైఎస్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు సహకారమందించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సినీనటి జయసుధ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రీ కిస్మస్ కేక్‌ను కట్ చేశారు.


కరపలోని రామలింగేశ్వరస్వామివారు


అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి


పెనుగుదురులోని బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి


చినమామిడాడలోని పంచముఖేశ్వరస్వామి


నడకుదురులోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి


పెద్దాపురప్పాడులోని ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

కార్తీక శోభ

- తొలి సోమవారం పూజలకు సర్వం సిద్ధం
- శివాలయాల్లో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

కరప: కార్తిక మాసం సందర్భంగా తొలి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. కరప, నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, వేళంగి, చినమామిడాడ, వాకాడ, వేములవాడ, కొరిపల్లి, అరట్లకట్ట గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల కోసం ఆయా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.

కరపలోని శివాలయం మూడు శతాబ్దాల చరిత్ర కలిగినది. ఈ ఆలయంలో పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి కొలువై ఉన్నారు. ఇక్కడ అభిషేకాలు, స్వామివారి దర్శనానికి ఈఓ వడ్డాది సత్తిబాబు ఏర్పాట్లు చేశారు. పెనుగుదురులోని శివాలయం ఐదు శతాబ్దాల నాటిదని, ఇక్కడి శివలింగాన్ని సాక్షాత్తు సీతాదేవి ప్రతిష్ఠించినట్టు చెబుతారు. అందుకే ఇక్కడ బాలాత్రిపుర సీతేశ్వరస్వామిగా గ్రామస్తులు కొలుస్తారు. వేములవాడలోని భీమేశ్వరాలయంలో వేములవాడ భీమకవి పూజలు చేశారని గ్రామస్తులు నమ్మకం. అరట్లకట్టలో పూర్వకాలంలో మల్లెతోటలో శివలింగం లభించడంతో అక్కడ శివాలయం నిర్మించారని, అందుకే ఇక్కడి స్వామివారిని మల్లేశ్వరస్వామిగా గ్రామస్తులు కొలుస్తారు.


కరపలోని పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం

నడకుదురులో బాలాత్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం దా అతిపురాతనమైంది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంజూరు చేసిన నిధులతో పురాతన శివాలయం పునర్నిర్మించిన తర్వాత వచ్చిన తొలి కార్తికమాసం ఇదే. నేపాల్, శ్రీకాకుళం తర్వాత పంచముఖాలున్న శివలింగం కూరాడ శివారు చినమామిడాడలో ఉంది. ఈ పంచముఖేశ్వరస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి కార్తిక ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లోని శివాలయాలకు రంగులు వేసి, విద్యుద్దీపాలంకరణతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

గృహ నిర్మాణ లక్ష్యాలు అధిగమించాలి

కమిషనర్ నాగనరసింహారావు ఆదేశం


సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసే దిశగా ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం కొమరగిరి లేఅవుట్‌లో గృహ నిర్మాణ ప్రగతిపై ఆయన హౌసింగ్, నగరపాలక సంస్థ, మెప్మా అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు వీలుగా లబ్ధిదారులు తమ వాటా సొమ్మును త్వరగా సమకూర్చుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బేస్మెంట్ పూర్తి చేసుకుని, రూఫ్ లెవెల్, శ్లాబ్ నిర్మాణానికి సిద్ధమవుతున్న లబ్ధిదారులకు లేబర్, మెటీరియల్ కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గృహ నిర్మాణ లక్ష్యాలకు సంబంధించి రోజువారి ప్రగతిని సమీక్షిస్తామన్నారు. వివిధ దశల్లో ఉన్న సుమారు ఏడు వేల ఇళ్లను వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రత్యేకాధికారులకు సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ సత్యనారాయణ రెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, ప్రత్యేక అధికారులు, సీవోలు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి

కాకినాడ రూరల్: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు రమణయ్యపేట ఏపీఎస్పీ ఎదురుగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు అద్దంకి రమణమూర్తి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఏపీ పీసీసీ ఉపాధ్యక్షుడు మట్ట ప్రసాద్ నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పోలిశెట్టి శ్రీనివాసు, ఆకుల రమణ, పాండురంగారావు, పెద్దాడ సుబ్బారాయుడు, పబ్బినీడి కృష్ణ, దవులూరి ధనరాజు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల

కాకినాడ: పది మందికీ సాయం చేసే ఆర్యవైశ్యులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు హామీ ఇచ్చారు. స్థానిక భానుగుడి జంక్షన్‌లోని పైడా కళాశాల ఆవరణలో ఆదివారం వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన అత్యంత వేడుకగా జరిగింది. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగుంట సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ఉండాలని, వీరికి తమ వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని వారు హామీ ఇచ్చారు. త్రిపురసుందరి ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఈబీసీ నేస్తం వల్ల ఎంతో మంది ఆర్యవైశ్యులకు ప్రయోజనం చేకూరిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైశ్య ప్రముఖులు నారాయణం మురళి, కంతేటి కాశి, బచ్చు రాజేష్, లింగమల్లు కృష్ణమూర్తి, ముత్తా నవీన్, పెద్ద సంఖ్యలో వైశ్య ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

వన సమారాధనల సందడి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని రాయుడు పాలెం వద్ద శ్రీవిజయ గణపతి బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. రాయుడు పాలెం, పరిసర ప్రాంతాలకు చెందిన బ్రహ్మణులు కుటుంబ సభ్యులతో సరదా గడిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొన్నారు. తిమ్మాపురంలోని అచ్చంపేట జంక్షన్ ఎంఎస్ఎన్ క్యాంపస్ మామిడి తోటలు ఎదురుగా ఎన్ఆర్ఐ పేరేంట్లు సంఘం, ఆది శైవ సంఘం వేర్వేరుగా కార్తిక సమారాధనలు నిర్వహించారు.

జాతి నిర్మాణకర్త డాక్టర్ అంబేడ్కర్

నడకుదురులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కన్నబాబు

కరప: భారతజాతి నిర్మాణకర్త, సమాజంలో అసమానతలు తొలగించేందుకు పాటుపడిన మహనీయుడు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికే గర్వకారణమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కననబాబు అన్నారు. కరప మండలం నడకుదురు ఎస్సీ వీధిలో ఆదివారం సర్పంచ్ డేగల లలిత కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడారు. ప్రపంచ మేధావిగా కీర్తించబడిన అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ పోరాట ఫలితమే రిజర్వేషన్లు అమలయ్యాయని గుర్తుచేశారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పాలన సాగిస్తున్నారన్నారు. అందరికీ విద్య, వైద్యం, ఆరోగ్యం అందించాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. ఎస్సీ నాయకులు జువ్వల చిన్నారావు, దాలిపర్తి శ్రీనివాస్, ఊబా రామచంద్రరావు, ముడే రాజు, గెడ్డం వెంకటరెడ్డి, జువ్వల రాజబాబు తదితర సంఘ నాయకుల విరాళాలతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ విగ్రహానికి ఎమ్మెల్యే కన్నబాబు మంజూరు చేసిన రూ.ఐదు లక్షలతో షెల్టర్ నిర్మించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, వాసంశెట్టి రామారావు, ఎంపీటీసీలు ముమ్మిడి బుచ్చిబాబు, పైలా రామతులసి, ఎ.శ్రీనివాస్, మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, ఎస్సీ నాయకులు మార్నెళ్ల వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, ఎస్.రాజేష్, మేడపాటి రాజ్‌కుమార్, మూరా అవినాష్, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, జవ్వాది సతీష్, కాదా వెంకటేశ్వరరావు, పోతల లోవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


నడకుదురులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ

నడకుదురులోని తులసీనగర్‌లో జలజీవన్ మిషన్ నిధులు రూ.90 లక్షలతో నిర్మించే రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఎమ్మెల్యే కన్నబాబు భూమిపూజ చేశారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు ట్యాంక్ నిర్మిస్తున్నట్టు చెప్పారు.

ఇంటింటా రక్షిత మంచినీటికి కార్యాచరణ

కరప: అన్ని గ్రామాల్లో ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించాలన్న సంకల్పంతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి పేర్కొన్నారు. వలసపాకలలో జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించే రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణానికి ఆమె భూమిపూజ చేశారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించినట్టు వివరించారు. ఎంపీటీసీ అనసూరి శ్రీనివాస్, గొడ్డటిపాలెం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, పార్టీ నాయకులు వజ్రపు కామేశ్వరరావు, మార్నెళ్ల వెంకటరమణ, కమిడి శంకర్, వనుం భాస్కర్, ఇంత సురేష్, చాట్రశ్రీను, గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

కరప: నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు.ఆ బ్యాచ్‌కు చెందిన డీహెచ్‌వీ సాంబశివరావు, మరో ఆరుగురు విద్యార్థులు కమిటీగా ఏర్పడ్డారు. విద్యార్థుల చిరునామాలు సేకరించి, అందరూ కలిసేలా ఏర్పాటు చేశారు. ఆనాటి ఏడుగురు గురువులను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

అయ్యప్ప స్వాముల పడిపూజ

కరప: గ్రామంలోని అయ్యప్పస్వాములు పడిపూజను అత్యంత భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. కరపలో కొత్తపేట, నీలయ్యతోట తదితర వీధులకు చెందిన 80 మంది వరకు అయ్యప్పస్వామి మాలధారణతో స్వామివారికి ఆదివారం ఉదయం నుంచి పూజలు చేశారు. మధ్యాహ్నం భిక్ష చేసిన తర్వాత, అయ్యప్ప స్వామిని పల్లకీ ఉంచి గ్రామంలో ఊరేగించారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

బోట్‌క్లబ్: భానుగుడి సమీపంలో ఉన్న గిల్డ్‌ఆఫ్ సర్వీసెస్ హైస్కూల్‌లో ఆదివారం ప్రఖండ భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరంలోని 10 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జన్మ నక్షత్ర పూజలు

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అలాగే పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి జన్మనక్షత్ర పూజలు నిర్వహించారు. కరప విష్ణ్వాలయంలోని వేంకటేశ్వరస్వామికి అర్చకుడు పెద్దింటి అనంతాచార్యులు జన్మనక్షత్ర పూజలు చేశారు.

బోట్‌క్లబ్: ధర్మప్రచార వారోత్సవాల సందర్భంగా స్థానిక జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తులసిపూజ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఉచితంగా తులసి మొక్కలను అందించారు. భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర సమరయోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని సర్పవరం జంక్షన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, బుద్ధరాజు సత్యనారాయణరాజు నివాళులర్పించారు.

క్రిస్టియన్ డాక్టర్స్ మీట్

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం బెరాకా బ్లెస్సింగ్స్ చర్చిలో క్రిస్టియన్ డాక్టర్ మీట్ జరిగింది. 80 మంది ప్రముఖ డాక్టర్లు హాజరయ్యారు.

సహకార వ్యవస్థతో బహుళ ప్రయోజనాలు

కాకినాడ: సహకార రంగంలో కొనసాగుతున్న వ్యవస్థలన్నీ సమర్థంగా పనిచేస్తున్నప్పుడే తగిన సార్థకత చేకూరుతుందని ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్ డిప్యూటీ రిజిస్ట్రార్, సహకార శిక్షణ కేంద్రం లెక్చరర్ వి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సహకార వారోత్సవాల సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో సహకార సొసైటీలు ఎలా అభివృద్ధి చెందాలనే అంశాలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నో సహకార సంఘాలు పారదర్శకంగా పనిచేస్తూ సేవలు మెరుగుపరుచుకున్నాయని, ఇప్పుడు ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.అనేక సంఘాలు స్వయం సమృద్ధి సాధించి, పంట రుణాలు, ఇతర ప్రయోజనాలను అందించగలుగుతున్నాయన్నారు. డీసీసీబీ జీఎం జి.ప్రవీణ్‌కుమార్, కేసీబీఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివబాలయోగి, మేనేజర్ చీమలకొండ గంగాధరం హాజరయ్యారు.

క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ డీఎస్ఏ క్రీడామైదానంలో సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. డిసెంబరు 8 నుంచి అనంతపురం జిల్లా గొల్లపల్లిలో జరిగే అంతర్‌జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారు.

కేంద్ర విధానాలతోనే పేదరికం


కాకినాడ సిటీ: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పేదరికం పెరిగిపోతోందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, రైతాంగ, మధ్య తరగతి, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో కాకినాడ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం అఖిలపక్ష సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఐఎన్‌టీయూ ఏపీ, తెలంగాణ ఆర్గనైజింగ్ కార్యదర్శి తాకూరి రాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావుతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పప్పు ఆదినారాయణ, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు సమావేశంలో మాట్లాడారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో 80 కోట్ల మంది ప్రజలు పేదరికంలోకి నెట్టబడ్డారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర చట్టం తెస్తేనే రైతాంగాన్ని సంక్షోభం నుంచి కాపాడగలమన్నారు. తక్షణం నిత్యావసరాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పేరుతో కేంద్రం ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని ఆరోపించారు. ఆయా అంశాలపై ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాలు, పార్టీల ప్రతినిధులు తోకల ప్రసాద్, గదుల సాయిబాబా, జి.బేబీరాణి, దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, జల్లూరి వెంకటేశ్వర్లు, గొడుగు సత్యనారాయణ, కేఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా..


ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఫైనల్‌ను తిలకిస్తున్న అభిమానులు

- ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్స్ వేళ టీవీలకు అతుక్కుపోయిన జనం
- భారత్ విజయం కోసం చివరి వరకూ ఎదురుచూపులు
- పలుచోట్ల భారీ లైవ్ స్క్రీన్లు
- ఓటమితో నిరాశ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): భారత్-ఆస్ట్రేలియా మధ్య అహ్మదాబాద్‌లో ప్రపంచ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ జరిగిన సందర్భంగా ఆదివారం ప్రధాన నగరాలు, పట్టణాల రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వరల్డ్ కప్ పోటీల ప్రారంభం నుంచీ భారత జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించడంతో అభిమానుల్లో వరల్డ్ కప్ విజయంపై అంచనాలు భారీగా పెరిగాయి. ఫైనల్ మ్యాచ్ ఆదివారం రావడంతో సాధారణ ప్రజలతో పాటు ఉద్యోగులు సైతం టీవీలకు అతుక్కుపోయి, మ్యాచ్‌ను ఎంతో ఉత్కంఠగా వీక్షించారు. మ్యాచ్‌ను లైవ్ టెలికాస్ట్ చేసేందుకు ప్రధాన ప్రాంతాల్లో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ)తో పాటు పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖుల ఆధ్వర్యాన భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. కాకినాడలో రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, రామచంద్రపురంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఏసీఏ ఆధ్వర్యాన భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. సుమారు 5 వేల మంది వరకూ మ్యాచ్‌ను వీక్షించేందుకు వీలు కల్పించారు. ప్రపంచ కప్‌ను భారత్ గెలవాలని నినదిస్తూ పెద్ద సంఖ్యలో యువత జాతీయ జెండాలు ఊపుతూ మ్యాచ్‌ను తిలకించారు. కాకినాడ నగరంలోని ప్రధాన హోటళ్లలో సైతం కస్టమర్లు మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. హోటల్ రూములు క్రికెట్ అభిమానులతోనే నిండిపోయాయి. ఏసీఏ ప్రతినిధి నవీన్‌రెడ్డి రెండు రోజులుగా కాకినాడలోనే ఉండి మ్యాచ్ లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భారత్ జట్టు విజయం సాధించాలంటూ అభిమానులు తమ ఇష్ట దైవాలను ప్రార్థించారు. వరుసగా పది మ్యాచ్‌ల్లో విజయాలు నమోదు చేసుకున్న భారత జట్టు.. ఫైనల్‌లో చివరి వరకు పోరాడి ఓటమిపాలు కావడంతో అభిమానులు కొంత నిరాశ చెందారు.


కాకినాడలో రమణయ్యపేట వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద భారీ లైవ్‌స్ట్రీమింగ్ స్క్రీన్


రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద అభిమానులతో కలిసి మ్యాచ్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడలో రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు భారీ లైవ్ స్ట్రీమింగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. క్రికెట్ అభిమానులతో సందడి నెలకొంది. ఎమ్మెల్యే కన్నబాబు, ఆయన తండ్రి సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆసక్తిగా మ్యాచ్‌ను తిలకించారు.